ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 146 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శుక్రవారం 4 సెప్టెంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## మంత్రివర్గం నుంచి
# కొండా సురేఖ ఔట్..


### తక్షణం కొండా సురేఖను బర్తరఫ్ చేయాలంటూ లేఖ పంపిన సీఎం
### రాజీనామాకు కొండా సురేఖ ససేమిరా అనడంతో బర్తరఫ్ నిర్ణయం
### సీఎం రేవంత్‌రెడ్డి సిఫార్సును ఆమోదించిన గవర్నర్ శివ్‌ప్రతాప్

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**

రాష్ట్ర కాంగ్రెస్‌లో కొద్దిరోజులుగా నలుగుతున్న కొండా సురేఖ ఎపిసోడ్‌కు తెరపడింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్ శివ్ ప్రసాద్ శుక్లాకు కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని లేఖను పంపడంతో ఆయన ఆమోదం తెలిపారు. దీంతో మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించినట్లైంది. అంతకు ముందు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించేందుకు ఏఐసీసీ క్లియరెన్స్ ఇచ్చింది.

రాజీనామాకు ససేమిరా : దీంతో తక్షణమే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌కు పంపిన లేఖలో స్పష్టం చేశారు. కొండా సురేఖను మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరినా అందుకు ఆమె నిరాకరించింది. దీంతో బర్తరఫ్ చేయాలని ముఖ్యమంత్రి లేఖ రాయడం, దానికి గవర్నర్ ఆమోదంతో పార్టీలో జరిగిన నాటకీయ పరిణామాలకు తెరపడినట్లైంది.

పీసీసీ సీరియస్ : పరకాల టికెట్ ఆశిస్తున్న కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు.. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించేందుకు కారణమయ్యాయనే హస్తం నేతలు అంటున్నారు.



పరకాల సిట్టింగ్ మీూ రేవూరి ప్రకాశ్ రెడ్డికే మళ్లీ టికెట్ ఇస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనను సుస్మిత గత నెల 19న కొండా సురేఖ పుట్టిన రోజు వేడుకల్లో బహిరంగంగా సవాల్ చేశారు. రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌లోని సీనియర్ నేతలపై అవినీతి ఆరోపణలు చేశారు. ఆ అంశంపై పలువురు కాంగ్రెస్ నేతలు పీసీసీకి ఫిర్యాదు చేశారు. పీసీసీ సూచన మేరకు మల్లు రవి నేతృత్వంలోని క్రమశిక్షణా కమిటీ ఆ విషయంపై దృష్టిసారించింది.

వాదనలు, వివరణలు : సుస్మిత వ్యాఖ్యలపై పూరిస్థాయిలో విచారణ చేయాలని మల్లు రవిని, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశించగా కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సుస్మిత వ్యాఖ్యలపై వివరణ తీసుకున్నారు. తన కుమార్తె స్వతంత్ర మహిళ అని పేర్కొన్న

..మిగతా 2లో

## హైకమాండ్‌ను రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేసి
# నన్ను బర్తరఫ్ చేయించారు

### కొండా సురేఖ
### తన కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారని నిలదీత
### రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదని వివరణ
### అధిష్ఠానానికి ఇచ్చిన లేఖను మీడియాకు ఇచ్చిన కొండా సురేఖ

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**



మంత్రివర్గం నుంచి తనను బర్తరఫ్ చేయాలన్న నిర్ణయంపై కొండా సురేఖ స్పందించారు. తనని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడాన్ని ఖండించారు. నిర్ణయానికి ముందు తన వివరణ తీసుకోవాల్సిందని తెలిపారు. తన కుమార్తె వ్యాఖ్యలకు తననెలా బాధ్యురాలిని చేస్తారని ప్రశ్నించారు. తన కుమార్తె స్వతంత్ర మహిళ అని, ఆమె వ్యాఖ్యలు ఆమెవేనని పేర్కొన్నారు. మీడియాకు ఇచ్చిన నోట్‌లో ఊరు, పేరు లేదు. రేవంత్ రెడ్డి పట్టుబట్టి : ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను మాత్రం ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తొలగించడం అధిష్ఠానానికి కూడా ఇష్టం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, 'బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపోమ్మంటారా'

..మిగతా 2లో

# కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత

### సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్
### ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి.. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద
### కుడా చైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్... బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం

2లో..

## దేశభక్తిలో మోదీ, అమిత్ షాలకు ఒవైసీ బ్రదర్స్
# తక్కువేమీ కాదు

### ఎంఐఎం దేశ వ్యతిరేకమనేది దుష్ప్రచారమన్న రేవంత్
### ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై అసద్, అక్బర్‌తో చర్చించానని వెల్లడి
### అసద్ సూచించిన అభివృద్ధి పనులను వెంటనే మంజూరు చేయాలని ఆదేశం
### పాతబస్తీ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ
### హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించడమే లక్ష్యమని వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు అసదుద్దీన్ ఒవైసీ ఏమీ తక్కువ కాదన్నారు. అసద్, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమంటూ జరుగుతున్న ప్రచారం దుష్ప్రచారం మాత్రమేనని చెప్పారు. సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని సీఎం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. అసదుద్దీన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ఓల్డ్‌సిటీ

..మిగతా 2లో

# ఆదికి అదృష్టం వరించేనా..?

### సురేఖ ఔట్..మంత్రి బెర్త్‌పై ఆది శ్రీనివాస్ పేరు
### బీసీ కోటా.. విధేయత.. విప్ అనుభవం.. కలిసి వస్తాయా?
### వేములవాడకు తొలిసారి మంత్రి పదవిపై మళ్లీ జోరుగా చర్చ

**వేములవాడ,సెప్టెంబర్3(ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామంచోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు గవర్నర్‌కు సిఫార్సు చేశారు. దీంతో ఖాళీ కానున్న మంత్రి పదవిని ఎవరితో భర్తీ చేస్తారన్న చర్చ ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో మొదలైంది. ఈ క్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేరు మరోసారి తెరపైకి వచ్చింది.

సురేఖ స్థానంలో ఆది?మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఏడాదికాలంగా రకరకాల ప్రచారాలు కొనసాగుతున్నాయి. ప్రతి సందర్భంలోనూ ఆది శ్రీనివాస్ పేరు మంత్రి రేసులో వినిపిస్తూనే ఉంది. అయితే అధిష్ఠానం నుంచి స్పష్టమైన నిర్ణయం లేకపోవడంతో అది ముందుకు సాగలేదు. తాజాగా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించడంతో.. ఖాళీ అయ్యే స్థానాన్ని బీసీ సామాజిక వర్గంతో భర్తీ చేయాలన్న సమీకరణం తెరపైకి వస్తే ఆది శ్రీనివాస్‌కు అవకాశం దక్కవచ్చున్న చర్చ మళ్లీ ఊపందుకుంది.

**బీసీ సమీకరణమే కీలకమా?**

మంత్రివర్గంలో మార్పులు జరిగే సమయంలో



సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు కీలకంగా మారుతాయి. సురేఖ స్థానంలో అదే విస్తృత సామాజిక సమీకరణాన్ని కొనసాగించాలన్న ఆలోచన ఉంటే.. మున్నూరు కాపు బీసీ వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్ పేరు సహజంగానే పరిశీలనలోకి వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా బీసీ ప్రాతినిధ్యంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మరో బెర్త్ కల్పించినట్లవుతుందన్న లెక్కలు వినిపిస్తున్నాయి.

**ఏడాదిగా వినిపిస్తున్న పేరు**

ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి దక్కుతుందన్న ప్రచారం ఇప్పటిది కాదు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై చర్చ జరిగిన ప్రతిసారీ ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే రాజకీయ సమీకరణాలు, అధిష్ఠానం నిర్ణయాలు, ఇతర ఆశావహుల పోటీతో ఈ అంశం వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పుడు మాత్రం సురేఖ తొలగింపుతో ఖాళీ ఏర్పడటంతో ఆది పేరు మరోసారి చర్చకు వచ్చింది.

**పార్టీ కోసం.. కష్టకాలంలోనూ**

ఆది శ్రీనివాస్ సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌తో అనుబంధాన్ని కొనసాగిస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. పార్టీ కష్టకాలంలోనూ కాంగ్రెస్ జెండాను వీడకుండా పనిచేశారన్న పేరు ఆయనకు ఉంది. 2009 నుంచి వేములవాడ అసెంబ్లీ స్థానంలో పోటీ చేస్తూ వచ్చిన ఆయన.. 2023 ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వ విప్‌గా కీలక

..మిగతా 5లో

## జెలెన్‌స్కీతో
# జైశంకర్ కీలక భేటీ

### యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ
### భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ
### బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ
### శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు

2లో..

# హైకమాండ్‌ను రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు

**మొదటి పేజీ తరువాయి...**

అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు. హైకమాండ్‌ను రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు : కొండా సురేఖ తన మీద, తన మాజీ ఓఎస్డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి, కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మరికొందరు ఉన్నారన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

“సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీపై నేను ఎలాంటి విమర్శలు చేయలేదు. ఒకప్పుడు మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిట్టారు. మాజీ సీఎం రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని తిట్టారు. నా కుమార్తె వ్యాఖ్యలకు నాపై చర్యలు తీసుకోవటం బాధాకరం. రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ పదవి తెచ్చుకున్నారని తిట్టినవారికి పదువులు ఇచ్చారు. నన్ను తొలగించినందుకు ఏమీ బాధపడటం లేదు. కారణం చెప్పకుండా తొలగించడమే చాలా బాధాకరం. బీసీ మహిళను ఇలా అవమానకరంగా తొలగించటం బాధాకరం. కారణం చెప్పకుండా తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. కారణం చెప్పాల్సిన బాధ్యత సీఎం, ఏఐసీసీపై ఉంది” – కొండా సురేఖ

మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని, తన ప్రమేయం లేకుండానే తన శాఖలో నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. తనకు తెలియకుండా తన ఓఎస్డీ సుమంత్‌ను తప్పించారని, అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని విమర్శించారు. తన శాఖలోని అంశాలపై కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, తన శాఖలోని అధికారులతో కడియం సమీక్షలు నిర్వహించారని తెలిపారు.

ప్రజల్లో వ్యతిరేకత ఉంది : మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా? గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలని సురేఖ కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ సంతోషంగా లేరనే విషయం అందరికీ తెలుసనని తెలిపారు. ఇప్పటికైనా అందరూ బయటికి వచ్చి ధైర్యంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలకు సేవ, అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలో ఉందని, పనుల జరగాలంటే ఎవరివద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని ఆరోపించారు. ఇస్తామన్న హామీలు నెరవేర్చకపోవటం వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేగా కొనసాగుతా? : క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రభుత్వం సర్వే చేయించుకుంటే మంచిదని సూచించారు. తాను పునరాలోచించుకోమని చెప్పనని, పార్టీ తీరు మారాల్సిన అవసరం ఉందని తెలిపారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే చాలా మార్పులు చేసుకోవాలని, రేవంత్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. తనవైపు ఒక వేలు చూపితే రేవంత్‌రెడ్డి వైపు నాలుగువేళ్లు చూపుతాయని ఎద్దేవా చేశారు. ప్లాన్–బిపై ఇంకా ఏమీ ఆలోచించుకోలేదనిఎమ్మెల్యేగా కొనసాగుతానని, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు.

ఇంకా ఆలోచించుకోలేదు : తన కుమార్తె వ్యాఖ్యలను తాను ఖండించాల్సిన అవసరం లేదన్న సురేఖ తన కుమార్తె వ్యక్తిగత అభిప్రాయాన్ని తప్పుపట్టే అధికారం తనకు లేదని స్పష్టం చేశారు. అధిష్ఠానానికి తాను ఇచ్చిన లేఖను మీడియాకు ఇస్తున్నానని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదని తెలిపారు. జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం నిర్ణయం తీసుకున్నారని ఆమె నిలదీశారు.

రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలి : తాను తప్పు చేయలేదని, తనకు పశ్చాత్తాపం లేదని కొండా సురేఖ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. వైఎస్ఆర్ తర్వాత రేవంత్ రెడ్డినే ఎక్కువ అభిమానించానని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు, సీఎం కావాలని తానే ముందు కోరుకున్నానని పేర్కొన్నారు.

సంతోషంగా ఉంది : తనపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నానన్న కొండా సురేఖ తన వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు రావటం సంతోషకరమని తెలిపారు. తన కోసం చిన్నారెడ్డిపై వేటు వేయటం సరికాదని అభిప్రాయపడ్డారు.

# జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

**యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ**

**భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ**

**బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ**

**శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**

ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్–ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ ‘ఎక్స్’లో స్పందించారు. “ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి” అని పేర్కొన్నారు.

నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు.

జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను ‘ఎక్స్’లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రి సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు.

ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు. శాంతి ప్రక్రియలో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఉక్రెయిన్ కోరింది.

భారత్–ఉక్రెయిన్ మధ్య వాణిజ్యం ప్రస్తుతం 2.6 బిలియన్ డాలర్లుగా ఉందని సిబిహా తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, పునర్నిర్మాణంలో భారత కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇంధనం, మౌలిక వసతులు, రవాణా, వ్యవసాయం, ఔషధాలు, డిజిటలైజేషన్, ఇంజినీరింగ్ రంగాల్లో సహకారానికి అవకాశాలున్నాయని చెప్పారు.

జైశంకర్ ఉక్రెయిన్ పర్యటన మరో విషయంలోనూ ప్రత్యేకంగా నిలిచింది. భారత విదేశాంగ మంత్రి ఉక్రెయిన్‌కు స్వతంత్ర ద్వైపాక్షిక పర్యటన చేయడం ఇదే తొలిసారి.

# తుంటను ఎత్తేసి.. మొద్దును ఎత్తుకున్న శాస్త్రం..!

**వెయ్యి రోజుల పాలనపై అధికార ప్రతిపక్షాల పోటాపోటీ.. సవాళ్లు, విమర్శలతో రాజకీయ వేడి..**

**నిన్నటి బీఆర్ఎస్‌పై నేటి కాంగ్రెస్.. నేటి కాంగ్రెస్‌పై నిన్నటి బీఆర్ఎస్.. ప్రజలు మాత్రం ఎవరి మాట నమ్మాలో తేల్చుకోలేక...!**

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**




తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఓ ఆసక్తికరమైన రాజకీయ దృశ్యం కనిపిస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలన పేరుతో సంబరాలు నిర్వహిస్తూ తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తోంది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ అదే వెయ్యి రోజుల పాలనను వైఫల్యాల పాలనగా అభివర్ణిస్తూ నిరసనలు, కార్యక్రమాలు చేపడుతోంది.ఇద్దరి మాటల్లోనూ ప్రజలే కేంద్రబిందువు.ఇద్దరి విమర్శల్లోనూ ప్రజల సమస్యలే అంశం.ఇద్దరి సభల్లోనూ హామీలే ప్రధాన అస్త్రం.కానీ ప్రజల్లో మాత్రం మరో ప్రశ్న వినిపిస్తోంది.నిన్న ఒకరిని నమ్మాం.. నేడు మరొకరిని నమ్మాం.. ఇక రేపు ఎవరిని నమ్మాలి..? తుంటా.. మొద్దా.?ప్రజల తీర్పే తుది.!రాజకీయాలను వ్యంగ్యంగా పరిశీలిస్తే.. గత బీఆర్ఎస్ పాలనను ‘తుంట’గా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనను ‘మొద్దు’గా పోల్చుకునే పరిస్థితి కనిపిస్తోందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.ఒకప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉండి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టింది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ అదే పాత్రను పోషిస్తోంది.అప్పుడు కాంగ్రెస్ చేసిన విమర్శలను ఇప్పుడు బీఆర్ఎస్ చేస్తోంది.ఇప్పుడు బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు అప్పట్లో కాంగ్రెస్ చేసిన సమాధానాలే తరహాలో కాంగ్రెస్ స్పందిస్తోంది.పార్టీలు మారాయి.. అధికార కుర్చీ మారింది.. కానీ రాజకీయ విమర్శల తీరు మాత్రం పెద్దగా మారలేదనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

**వెయ్యి రోజులు.. రెండు వాదనలు....!**

కాంగ్రెస్ నాయకులు మాత్రం వెయ్యి రోజుల పాలనను విజయవంతమైన ప్రజా పాలనగా అభివర్ణిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, రైతులు, మహిళలు, యువతకు చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

మరోవైపు బీఆర్ఎస్ నాయకత్వం మాత్రం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి.? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, యువత, పేదల సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తోంది.

ఇలా అధికార పక్షం వెయ్యి రోజుల విజయోత్సవం అంటుంటే.. ప్రతిపక్షం వెయ్యి రోజుల మోసం అంటూ ప్రజల్లోకి వెళ్తోంది.

**సవాళ్ల ఘనం.. నిజం ఎంత...?**

రాజకీయ వేదికలపై సవాళ్లు విసురుకోవడం కొత్తేమీ కాదు. అయితే ఇప్పుడు రెండు ప్రధాన రాజకీయ శిబిరాల మధ్య మాటల యుద్ధం మరింత ముదురుతోంది.మేము ఇది చేశాం,

మీరు అది చేయలేదు,మా హామీలు అమలు చేశాం,మీ హామీలు ఏమయ్యాయి..?

అంటూ పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు.అయితే రాజకీయ పార్టీల మాటలకంటే ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పే అసలు కొలమానం.రైతుకు లాభమైందా.?

**యువతకు ఉద్యోగం దొరికిందా.?**

మహిళకు ఆర్థిక భరోసా పెరిగిందా.?

పేద కుటుంబానికి ఇల్లు, విద్య, వైద్యం అందిందా.? గ్రామానికి రోడ్డు, తాగునీరు, సాగునీరు వచ్చాయా.?

ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలే ప్రజల తీర్పును ప్రభావితం చేయనున్నాయి.

**‘తుంటను ఎత్తేసి.. మొద్దును ఎత్తుకున్న శాస్త్రం’!**

తెలంగాణ రాజకీయాల్లో ప్రజల నోట వినిపిస్తున్న వ్యంగ్య వ్యాఖ్యల్లో ఇదొకటి.

తుంటను ఎత్తేసి.. మొద్దును ఎత్తుకున్న శాస్త్రం అయిపోయింది..!అంటే గత ప్రభుత్వంపై అసంతృప్తితో ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి ఏర్పడితే మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తారా.? లేక మరో ప్రత్యామ్నాయాన్ని ఎంచుకుంటారా.? అన్నదే రాజకీయ వర్గాల్లో చర్చ.

ఇక్కడ అసలు విషయం పార్టీలు కాదు.. ప్రజల విశ్వాసం.ఒకసారి అధికారంలోకి వచ్చిన పార్టీ ప్రజల అంచనాలను అందుకోకపోతే ప్రజలు మరో పార్టీకి అవకాశం ఇస్తారు. అదే పార్టీ కూడా అంచనాలను అందుకోలేకపోతే మళ్లీ ప్రజలు తమ రాజకీయ నిర్ణయాన్ని మార్చుకుంటారు.

**అందుకే ప్రజాస్వామ్యంలో శాశ్వతంగా ఎవరికీ అధికారం రాసి ఉండదు.**

లిప్రజలు చూస్తున్నది మాటలు కాదు.. పనులు..!లిఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు ప్రజల జ్ఞాపకాల్లో ఉంటాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిలో ఎన్ని అమలు చేశారన్నదే ప్రజల పరిశీలన.ప్రభుత్వం సంబరాలు చేసుకుంటే ప్రజలు కూడా అదే స్థాయిలో సంతోషంగా ఉన్నారా...?

ప్రతిపక్షం ప్రభుత్వం విఫలమైందంటే ప్రజలు కూడా అదే అభిప్రాయంలో ఉన్నారా..?

అన్నది ఎన్నికల సమయంలోనే స్పష్టమవుతుంది.!

అంతవరకు మాత్రం అధికార––ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవచ్చు. సవాళ్లు విసురుకోవచ్చు. సభలు నిర్వహించవచ్చు. భారీ కార్యక్రమాలు చేపట్టవచ్చు.

కానీ ప్రజల తీర్పు మాత్రం రాజకీయ సభల్లో కాదు.. ఓటు పెట్టే రోజునే వెలువడుతుంది.

**సానుభూతి కోసం రాజకీయ ఆపసోపాలు..?**

ప్రస్తుత రాజకీయ పరిస్థితిని గమనిస్తే రెండు శిబిరాలు కూడా ప్రజల్లో తమకు అనుకూల వాతావరణం సృష్టించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది.

అధికార పక్షం అభివృద్ధి, సంక్షేమం, పాలనా విజయాలను ప్రచారం చేస్తోంది.

ప్రతిపక్షం ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలు తీరును ప్రశ్నిస్తోంది.ఇద్దరి లక్ష్యం ఒక్కటే ప్రజల విశ్వాసాన్ని తిరిగి సంపాదించుకోవడం.

అయితే ప్రజలు మాత్రం గత అనుభవాలను, ప్రస్తుత పరిస్థితులను బేరీజు వేసుకుంటున్నారు.

**ఎవరు ఎక్కువగా మాట్లాడారు.? కంటే**

ఎవరు ఎక్కువగా చేశారు..? అన్నదే ప్రజలకు ముఖ్యమవుతోంది.చివరికి.. ప్రజలదే శాస్త్రం..!

తుంట కావచ్చు.. మొద్దు కావచ్చు.. ఏ పార్టీ అయినా ప్రజల కోసం పనిచేస్తేనే ప్రజలు ఆదరిస్తారు.గతాన్ని తవ్వడం ద్వారా భవిష్యత్తు నిర్మాణం కాదు.గత ప్రభుత్వ తప్పులను చూపించడం ఒక్కటే ప్రస్తుత ప్రభుత్వానికి విజయపత్రం కాదు.ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం ఒక్కటే ప్రతిపక్షానికి ప్రజల మద్దతును తెచ్చిపెట్టదు.

ప్రజలకు కావాల్సింది మాటల యుద్ధం కాదు.. పని.సవాళ్లు కాదు.. పరిష్కారాలు.

**సంబరాలు కాదు.. ఫలితాలు.**

వెయ్యి రోజుల రాజకీయ రచ్చలో అధికార పక్షం విజయోత్సవాలు చేసుకుంటోంది.. ప్రతిపక్షం పోరుబాట పడుతోంది.కానీ ఈ రెండు శిబిరాల మధ్య నిలబడి ఉన్న ప్రజలు మాత్రం ప్రశాంతంగా ఒక్కటే అడుగుతున్నారు.?

తుంటను ఎత్తేసి మొద్దును ఎత్తుకున్నాం.. ఇక మరోసారి ఎవరిని ఎత్తుకోవాలి..?

ఆ ప్రశ్నకు సమాధానం రాజకీయ నాయకుల దగ్గర లేదు. ప్రజల ఓటు దగ్గరే ఉంది.



## మండల విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట అర్ధరాత్రి గ్రామస్థుల ధర్నా

**గద్వాల జిల్లా ప్రతినిధి (మాచర్ల / కొత్తపల్లి) , సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**

విద్యుత్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామస్థులు మాచర్ల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద అర్ధరాత్రి ధర్నా నిర్వహించి సబ్ స్టేషన్‌ను ముట్టడించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు, నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలో నిరంతరం విద్యుత్ కోతలు విధించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకాశంలో మబ్బులు వేసినా, సన్నపాటి గాలి వీచినా, చినుకులు పడినా వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని తెలిపారు. పక్కనే ఉన్న ఇతర గ్రామాలకు, ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉంటున్నా, మల్లంపల్లి, కొత్తపల్లి గ్రామాలకు మాత్రం కరెంట్ పునరుద్ధరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. రాత్రి వేళల్లో కనీసం సింగిల్ ఫేజ్ విద్యుత్ కూడా ఇవ్వకపోవడంతో దోమలు, పాములు, విషకీటకాల భయంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. స్థానికంగా ఉన్న లైన్ మెన్లకు వయసు పైబడటంతో పనుల్లో ఆలస్యం జరుగుతోందని, యువకులైన సిబ్బందిని కేటాయించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి గ్రామస్థుల పరంగా అవసరమైన కూలీలను, ఇతర సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి విద్యుత్ లైన్లను పునరుద్ధరించాలని కోరారు.తమ సమస్యపై విద్యుత్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, విద్యుత్ లైన్లను సరిచేసి క్రమం తప్పకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని, లేనిపక్షంలో నిరసనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ఔట్

**మొదటి పేజీ తరువాయి...**

కొండా సురేఖ.. ఆ వ్యాఖ్యలకు తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఆ వ్యాఖ్యలకి తాను బాధ్యురాలిని కాదని క్రమశిక్షణా కమిటీ ముందు వివరణఇచ్చారు. తనపై అవినీతి ఆరోపణలు లేవి సురేఖ వివరణ ఇచ్చినా.. క్రమశిక్షణా కమిటీ సంతృప్తి చెందలేదు. సుస్మిత వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిందని తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానించి నివేదికను ఢిల్లీకి పంపింది.

హస్తినకు చెందిన పంచాయితీ : తరువాత దిల్లీ వేదికగా హైడ్రామా సాగింది. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ హస్తినలో పార్టీ హైకమాండ్‌తో సమావేశమయ్యారు. పార్టీలో క్రమశిక్షణే ముఖ్యమని కఠిన చర్యలు తీసుకోకపోతే పార్టీలో తిరుగుబాట్లు పెరుగుతాయని అధిష్ఠానం పెద్దలకు నివేదించారు. దిల్లీ వెళ్లిన కొండా సురేఖ కూడా ఖర్గేను కలిసి తన వాదన వినిపించారు.

తాను బీసీ సామాజికవర్గానికి చెందిన వారమని తమ కుటుంబానికి పెద్ద ఓటుబ్యాంక్ ఉందని చెప్పుకొచ్చారు. అయినా శాంతించని హైకమాండ్ రాజీనామా చేయాలని స్పష్టంచేసింది. సురేఖ అందుకు అంగీకరిచకపోవటంతో సీఎం రేవంత్ నేరుగా కొండా సురేఖను బర్తరఫ్ చేయాలని సిఫార్సు చేస్తూ గవర్నర్‌కి లేఖ పంపారు.

“నన్ను బర్తరఫ్ చేయడాన్ని ఖండిస్తున్నా. నిర్ణయానికి ముందు నా వివరణ తీసుకోవాల్సింది. నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు?. నా కుమార్తె స్వతంత్ర మహిళ ఆమె వ్యాఖ్యలు ఆమెవే” – కొండా సురేఖ

కీలక పదవుల్లో మార్పులు : రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘారెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి.చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద నియమితులయ్యారు.

## కేబినెట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**

రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు. కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానం లో కొత్త నియామకాలు చేపట్టారు. చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటం తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

## దేశభక్తిలో మోదీ, అమిత్ షాలకు ఒవైసీ బ్రదర్స్ తక్కువేమీ కాదు

**మొదటి పేజీ తరువాయి...**

అభివృద్ధిపై తాను అసదుద్దీన్, అక్బరుద్దీన్‌తో చర్చించినట్లు తెలిపారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు**

సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి గత ప్రభుత్వం కొబ్బరికాయ కొట్టిందే తప్ప ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాతే పనులు ముందుకు సాగాయని చెప్పారు. ఇన్నేళ్లలో ఎంతమంది ముఖ్యమంత్రులు ఓల్డ్‌సిటీకి వచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. పాతబస్తీ గల్లీల్లోకి తాను తప్ప మరెవరూ రాలేదన్నారు.

**అసద్ చెప్పిన పనులకు వెంటనే అనుమతులు**

ఓల్డ్‌సిటీ అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఏది సూచించినా వెంటనే పరిశీలించి మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నట్లు రేవంత్ చెప్పారు. పాతబస్తీలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యమన్నారు. పెద్దలు ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు.

**హిందూ, ముస్లింలు కలిసి ఉండాలి**

ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వమేనని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు.

# నూతన ఆయిల్ పామ్ తోటల్లో ఏఐ

## రోబోట్ ప్రయోగాత్మక పరిశీలన : ఉద్యాన వర్శిటీ వైస్ చాన్సలర్ దండ రాజిరెడ్డి

**బుద్వేల్, సెప్టెంబరు 3 (ప్రభాత ఉదయం)**

కృతిమ మేధ ఆధారిత యంత్ర పరికరాలపై పరిశోధనలు ముమ్మరం చేశామని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ లోని ఔషధ, సుగంధ మొక్కల పరిశోధన స్థానంలో ఇటీవల నాటిన నూతన ఆయిల్ ఫామ్ తోటలో అంతర పంటల వరుసల మార్కింగ్ కోసం ఎక్స్-మెషిన్ ఏఐ స్వయం చాలక రోబోట్ ప్రయోగాత్మక పరిశీలనను విజయవంతంగా నిర్వహించారు. ఈ పరిశీలన లో బాగంగా రోబోట్ లోని టర్టిల్, రాబిట్, హ్యూమన్ మోడ్లను క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పరీక్షించారు. ఆయిల్ ఫామ్ చెట్ల మధ్య అందుబాటులో ఉన్న స్థలంలో జంట వరుసల పద్ధతిలో, అంటే వరుసల మధ్య 45 సెం. మీ, జంట వరుస ల మధ్య 90 సెం. మీరు కాలి ఉండేలా అత్యంత ఖచ్చితత్వంలో రోబోట్ లే ఔట్ మార్కింగ్ ను పూర్తి చేసింది. వ్యవసాయ రంగంలో తీవ్రమవుతున్న కూలీల కొరత ను అధిగమించడం, క్షేత్ర స్థాలు లో ఉత్పాదకతను పెంచడంతో పాటు ఆయిల్ ఫామ్ తోటల ప్రారంభ దశలో కూరగాయలు, పూల తోటలు, ఔషధ సుగంధ మొక్కల అంతర పంటల సాగును యంత్రాల సహాయంతో విజయవంతంగా సమగ్ర పరచడమే ఈ ప్రయోగం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. ఈ ప్రత్యక్ష ప్రయోగాత్మక పరిశీలన అనంతరం అందరికి అందుబాటులోకి తెస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూరగాయల పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ వి మురళి, ఇంజనీర్ ఆర్ అశ్విన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




ఫామ్ ఆయిల్ పంటలలో అంతర సాగు పంటలు వేసే విధానాన్ని పరిశీలిస్తున్న ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజి రెడ్డి



# దుర్గానగర్‌లో రూ.7.50లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం..

## ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనకు చర్యలు..

## అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ నాయకులు

**రాజేంద్రనగర్,సెప్టెంబర్03(ప్రభాత ఉదయం)**


మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని దుర్గానగర్‌లో ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు వర్షాకాలంలో రహదారులపై నీరు నిల్వ ఉ ండకుండా,ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేలా రూ. 7.50లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.దుర్గానగర్‌లోని శ్రీనివాస ఆసుపత్రి సమీపంలో చేపట్టిన ఈ పనులు పూర్తయితే స్థానిక కాలనీవాసులకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని నాయకులు తెలిపారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని,కాలనీల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.రహదారులు,కాలువలు,వీధి దీపాలు,తాగునీటి సదుపాయాల వంటి అంశాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.దుర్గానగర్‌తో పాటు డివిజన్‌లోని ఇతర ప్రాంతాల్లో కూడా దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని,ప్రజల సహకారంతో మరిన్ని సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని నాయకులు వెల్లడించారు.అభివృద్ధే తమ లక్ష్యమని,సేవే తమ ధ్యేయమని పేర్కొంటూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధనుంజయ,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు టి.ప్రేమ్ గౌడ్,శ్రీనివాస్ రెడ్డి,లక్ష్మారెడ్డి,ఆంజనేయులు గౌడ్,బండారి యాదగిరి,భాస్కర్ రెడ్డి,వెంకటేష్,ప్రసాద్,రాజు,శ్రావణ్,ఈశ్వర్ పంతులు,శ్రీపాల్ రెడ్డి,ఫయాం భాయ్‌తో పాటు పెద్ద సంఖ్యలో బస్తీ వాసులు పాల్గొన్నారు.




# గీతాంజలి రోబోటిక్ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**పటాన్ చెరు, సెప్టెంబర్ 3 ( ప్రభాత ఉదయం):**

ఇస్నాపూర్ గీతాంజలి రోబోటిక్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించ బడ్డాయి. పాఠశాల కరస్పాండెంట్ కృష్ణ కిషోర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు శ్రీకృష్ణుడు , గోపికల వేషధారణలలో కనిపించి, అందరినీ అలరించారు. పిల్లల నృత్య ప్రదర్శనలు,ఇతర కళా ప్రదర్శనలు పండుగ వాతావరణాన్ని మరింత రంగులమయంగా మార్చాయి.ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లలలో సృజనాత్మకతను, భారతీయ సంస్కృతిపై అవగాహనను పెంచుతాయని పేర్కొన్నారు. పిల్లలు చాలా ఉ త్సాహంగా పాలుపంచుకున్నారని, వారి ప్రతిభను గుర్తించడం ఆనందంగా ఉందని చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు ప్రియదర్శిని మాధవి,నాగరాణి,దివ్య,కల్పన, లక్ష్మి,సునీత, శిరీష, వందన, కృష్ణవేణి, సుప్రిత,సహాయకులు లక్ష్మి, సోనాలి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఈ వేడుకలకు హాజరయ్యారు. చిన్నారుల వేషధారణలు, ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.






# హైదర్‌గూడ డివిజన్‌లో ఎన్నికల అధికారి సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి పర్యటన

## ఓటరు కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు

**రాజేంద్రనగర్,సెప్టెంబర్03(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గం హైదర్‌గూడ డివిజన్‌లో గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి,రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి పర్యటించి ఓటరు కేంద్రాలను పరిశీలించారు.ఓటరు నమోదు ప్రక్రియలో పేర్లలో తప్పులు ఉన్నవారు,ఓటరు వివరాలను అనుసంధానం చేసుకోని వారికి అధికారులు నోటీసులు జారీ చేయడంతో వారు సంబంధిత ధ్రువపత్రాలను ఓటరు కేంద్రాల్లో సమర్పించి ఓటరు జాబితాలో తమ పేర్లను సరిచేసుకునే ప్రక్రియ కొనసాగుతోంది.ఈ ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతున్నదనే అంశాన్ని సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ధ్రువపత్రాలను సమర్పిస్తున్నారు,వాటిని సిబ్బంది ఏ విధంగా పరిశీలించి నమోదు చేస్తున్నారు,సంబంధిత వివరాలను ఏ విధంగా భద్రపరుస్తున్నారనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఓటరు జాబితాలో పేర్లు,వివరాలకు సంబంధించి అభ్యంతరాలు ఉన్న ప్రతి ఓటరుకు నోటీసులు అందజేసి,వారు సరైన ధ్రువపత్రాలను సమర్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,అదే సమయంలో ఓటరు వివరాల్లో ఉన్న తప్పులను నిబంధనల ప్రకారం సరిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఓటరు నమోదు,వివరాల సవరణ,ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.




శ్రీ క్రిష్ణ జన్మాష్టమి సందర్భంగా రాజేంద్రనగర్ లో జరిగిన ఓ కార్యక్రమంలో శ్రీ కృష్ణుడి వేషదారణలో పాల్గొన్న వేముల వేధ ఆర్జున్. చిన్నారి వేధ అర్జున్ శ్రీ క్రిష్ణ వేషధారణ లో అందరిని ఆకట్టుకుంది.

బుద్వేల్, ప్రభాత ఉదయం



# ఎమ్మెల్యేను కలిసిన టీయూడబ్ల్యూజే--ఐజేయూ నూతన కార్యవర్గం

## జర్నలిస్టులకు అండగా ఉంటా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హామీ

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**

పటాన్‌చెరు నియోజకవర్గ టీయూడబ్ల్యూజే--ఐజేయూ నూతన కార్యవర్గం గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు పత్తి నర్సింహా ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం తమ సమస్యలతో కూడిన మెమోరాండాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పత్తి నర్సింహా మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమంతో పాటు సంఘం కార్యక్రమాలకు ఎమ్మెల్యే సహకారం ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి స్పందిస్తూ జర్నలిస్టులకు, టీయూడబ్ల్యూజే--ఐజేయూకు తనవంతు సహకారం తప్పకుండా అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పర్చ శ్రీనాథ్, పటాన్చెరు నియోజకవర్గ సలహాదారులు కాశిపతి, సులేమాన్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కమిటీ భాద్యులు శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మాజిద్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు విట్టల్, రఘురాంరెడ్డి, రాజు, నాగేష్, జీవరత్నం, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాస్, ప్రభాకర్, కోటెశ్, ఆర్గనిసింగ్ సెక్రటరీలు రాజు, వివేక్, శ్రీనివాస్, శంకర్, శేఖర్, మహేందర్ గౌడ్, సిద్దు, శ్రీనివాస్, నాయుడు, పురుషోత్తం, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.



# హైదర్ గూడ డివిజన్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎన్నికల అధికారి సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పర్యటన

**బుద్వేల్ , సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్ నియోజకవర్గం హైదర్ గూడ డివిజన్ లో గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పర్యటించి ఓటరు కేంద్రాలను పరిశీలించారు. ఓటరు నమోదు ప్రక్రియ లో పేర్లు తప్పులున్న వారు, మ్యాపింగ్ చేసుకోని వారి కి అధికారులు నోటీసులు ఇవ్వగా, వాటికి కావాల్సిన ధృవ పత్రాలను ఓటర్లు ఓటరు కేంద్రాల్లో సమర్పించి ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకుంటున్నారు. అందుకు సంబంధించిన ప్రక్రియ ఏ విధంగా సాగుతున్నది అని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ గా ఉన్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. నోటీసులు అందుకున్న వారు ఎలాంటి ధ్రువ పత్రాలను తీసుకువస్తున్నారు... వాటిని సిబ్బంది ఎలా అప్ లోడ్ చేస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. అభ్యంతరాలు ఉన్న ప్రతి ఓటరుకు నోటీసు అందచేసి సరియైన ధ్రువ పత్రాలను తీసుకొని వారి ఓటు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు




హైదర్ గూడ లోని ఓటరు నమోదు కేంద్రాలను సందర్శించి అభ్యంతరాలు ఉన్న ఓటర్లకు అందచేస్తున్న నోటీసులు, సమర్పిస్తున్న పత్రాలు, అప్ లోడ్ చేస్తున్న తీరును పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి




రైతులనుద్దేశించి మాట్లాడుతున్న పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం కిషన్ కుమార్

# ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో పశుపోషణలో మెరుగైన ఆదాయం

**బుద్వేల్, సెప్టెంబరు 3 (ప్రభాత ఉదయం)**

పశుపోషణలో ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకుని, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా తక్కువ పెట్టుబడి తో అధిక ఉత్పాదకత, మెరుగైన ఆదాయం సాదించాలని పీవీ నర్సింహ్మారావు తెలం గాణ పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం కిషన్ కుమార్ సూచించారు. రాజేం ద్రనగర్ లోని పీవీ నర్సింహ్మారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం రైతు శిక్షణ కేంద్రం ఆధ్వర్యం లో సెప్టెంబరు 2,3 తేదీలలో పశుసంపద ఆధారిత సమగ్ర జీవనోపాధులు అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల రైతు శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ముల్కనూర్ కో ఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన రైతులు ఈ శిక్షణ లో పాల్గొన్నారు. ఈ సందర్భం గా డాక్టర్ ఎం కిషన్ కుమార్ మాట్లాడుతూ, పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను అవలంబించడం ద్వారా ఉత్పాదకతతో పాటు రైతులు ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి మాధురి, ముల్కనూర్ కో ఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసెడింట్ జి వీరయ్య తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# స్నేహితుల ఇంటికి వెళుతున్నానని .. కనిపించకుండ పోయిన యువతి

**బుద్వేల్, సెప్టెంబరు 3 (ప్రభాత ఉదయం)**

నౌ నెంబర్ ప్రాంతంలో స్నేహితురాలి జన్మదిన వేడుకలు ఉన్నాయని, ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయింది. వివరాలను రాజేం ద్రనగర్ ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి వెల్లడించారు..... ఉప్పర్ పల్లి శ్రీ చైతన్య కళాశాల లో ఇంటర్ ద్వితీయ సం వత్సరం చదువుతున్న ఆదిత్య రాణి (19) ఈ నెల 1వ తేదీన నౌనెంబర్ ప్రాంతంలో స్నేహితురాలి జన్మదినం ఉందని ఇంట్లో నుంచి బయలుదేరింది. ఎంతకు తిరిగి రాకపోవడంతో ఆదిత్య రాణి తండ్రి కె రవిందర్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు. చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఆదిత్య రాణి

# నోటీసులు అందుకున్న ఓటర్లు సరైన డాక్యుమెంట్లు సమర్పించాలి

**ఎస్ఐఆర్‌పై సెప్టెంబర్ 5, 6, 12, 13 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు.**

**ఫామ్ 6, 7, 8లను సద్వినియోగం చేసుకోవాలి.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**

ఎలక్టోరల్ రోల్ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సెప్టెంబర్ 5, 6, 12, 13 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల సంఘం నిర్దేశించిన సరైన డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉ ఒటుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక ప్రచార దినాల్లో సంబంధిత బూత్ లెవల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో నిర్దేశించిన సమయాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండి ఓటర్లకు అవసరమైన సేవలను అందించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు ఫారం--6 ద్వారా కొత్తగా తమ పేరును నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు జాబితాలోని ఏదైనా పేరుపై అభ్యంతరం వ్యక్తం చేయడం లేదా అనర్హులైన ఓటరు పేరును తొలగించేందుకు ఫారం--7 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఓటరు వివరాల్లో తప్పులను సరిచేయడం, నివాసం మారిన సందర్భంలో చిరునామా, తదితర వివరాలను మార్చడం, ఓటరు గుర్తింపు కార్డుకు సంబంధించిన అనుమతించబడిన సవరణల కోసం ఫారం--8 ను సమర్పించవచ్చని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో మ్యాపింగ్ కాని, అనామిలిసు జాబితాలో ఏ, బి, సి కేటగిరీలో ఉన్న ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన ఏవేని ధ్రువపత్రాలను సమర్పించాన్నారు. ఏ కేటగిరీలో 01.07.1987కు ముందు జన్మించిన ఓటర్లు ఉంటారని, ఎన్నికల సంఘం నిర్దేశించిన ధృవపత్రాల్లో తమకు సంబంధించిన ఏదైనా ఒక పత్రం సమర్పించాలన్నారు. బీ కేటగిరీలో 01.07.1987 నుంచి 02.12.2004 వరకు జన్మించిన ఓటర్లు ఉంటారని, వీరు తమతోపాటు వారి తల్లిదండ్రుల్లో ఎవరిదైనా ఒక ధ్రువపత్రం అంటే మొత్తం రెండు డాక్యుమెంట్స్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. సి కేటగిరీలో 02.12.2004 తర్వాత జన్మించిన ఓటర్లు వస్తారని, వీరు తమకు సంబంధించిన ఒక పత్రం తో పాటు తల్లి, తండ్రి ఇద్దరికీ సంబంధించిన పత్రాలు కలిపి మొత్తం మూడు డాక్యుమెంట్స్ సమర్పించాలనీ పేర్కొన్నారు.



**సమర్పించవలసిన పత్రాల జాబితా:**

1. కేంద్ర ప్రభుత్వం / రాష్ట్ర ప్రభుత్వం / ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగి లేదా పెన్షనర్‌కు జారీ చేసిన గుర్తింపు కార్డు / పెన్షన్ చెల్లింపు ఉత్తర్వు.
2. 01.07.1987కు ముందు ప్రభుత్వం / స్థానిక సంస్థలు / బ్యాంకులు / పోస్టాఫీసులు / భారతీయ జీవిత బీమా సంస్థ / ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా భారతదేశంలో జారీ చేసిన గుర్తింపు కార్డు / ధృవీకరణ పత్రం / సంబంధిత పత్రం.
3. సమర్థ అధికారిచే జారీ చేయబడిన జనన ధృవీకరణ పత్రం.
4. పాస్‌పోర్ట్.
5. గుర్తింపు పొందిన బోర్డులు / విశ్వవిద్యాలయాలు జారీ చేసిన మెట్రిక్యులేషన్ విద్యార్హత ధృవీకరణ పత్రం.
6. సంబంధిత రాష్ట్ర సమర్థ అధికారిచే జారీ చేయబడిన శాశ్వత నివాస ధృవీకరణ పత్రం.
7. అటవీ హక్కుల ధృవీకరణ పత్రం.
8. సమర్థ అధికార యంత్రాంగం ద్వారా జారీ చేయబడిన కుల ధృవీకరణ పత్రాలు.
9. జాతీయ పౌర పట్టిక ఎక్కడైతే అందుబాటులో ఉ ందో అక్కడ.
10. రాష్ట్ర / స్థానిక అధికారులచే తయారు చేయబడిన కుటుంబ రిజిస్టర్.
11. ప్రభుత్వం జారీ చేసిన భూమి / ఇంటి కేటాయింపు ధృవీకరణ పత్రం.

ఈ విధంగా మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్లు సమర్పించిన పత్రాలను పరిశీలించి, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం తదుపరి ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్లు సమర్పించే ప్రతి దరఖాస్తుకు సరైన రసీదు ఇవ్వాలని, స్వీకరించిన దరఖాస్తులు, పత్రాలను నిర్ణీత పోర్టల్/అప్లికేషన్‌లో వెంటనే నమోదు చేసి సంబంధిత ఏఈఆర్‌ఓకు తదుపరి పరిశీలన, పరిష్కారం కోసం పంపించాలని సూచించారు. ప్రత్యేక ప్రచార దినాలపై గ్రామాలు, వార్డుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి, అర్హులైన ప్రతి పౌరుడు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత ఏఈఆర్‌ఓలు తమ పరిధిలోని ప్రతి బీఎల్ఓలు, సూపర్‌వైజర్లకు సూచనలు తెలియజేయడంతో పాటు, ప్రత్యేక ప్రచార దినాల్లో పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ప్రత్యేక ప్రచార దినం ముగిసిన వెంటనే ఫారం--6, ఫారం--7, ఫారం--8 ద్వారా స్వీకరించిన దరఖాస్తుల సంఖ్య, ఎస్ఐఆర్‌కు సంబంధించి సేకరించిన పత్రాల వివరాలు, బీఎల్ఓల హాజరు, దరఖాస్తుల నమోదు, తదితర అంశాలతో కూడిన రోజువారీ సమగ్ర నివేదికను సమర్పించాలని ఏఈఆర్‌ఓలను ఆదేశించారు. ప్రత్యేక ప్రచార దినాల్లో విధులకు గైర్హాజరు కావడం, నిర్లక్ష్యం వహించడం లేదా విధులను సక్రమంగా నిర్వహించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించి, సంబంధిత సిబ్బందిపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.



## కొండాపురంలో నూతన అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండలం కొండాపురం గ్రామంలో గత ఏడు సంవత్సరాలుగా ఏకైక అంగన్‌వాడీ కేంద్రం మాత్రమే ఉండటంతో, గ్రామ కింది ప్రాంతానికి చెందిన చిన్నారులు దూరభారాల వల్ల కేంద్రానికి రాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించి, చిన్నారులకు సేవలను మరింత చేరువ చేసేందుకు సర్పంచ్ ఎస్. పవన్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.స్థల దాత కె. నర్సీ రెడ్డి (అలియాస్ పటేల్) కి చెందిన స్థలంలో ఉన్న షెడ్డును సర్పంచ్ తన సొంత పర్యవేక్షణలో ఆకర్షణీయంగా మరమ్మతులు చేయించి, తాత్కాలిక అంగన్‌వాడీ కేంద్రంగా తీర్చిదిద్దారు. ఈ నూతన తాత్కాలిక అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం జిల్లా సంక్షేమాధికారి సునంద ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు ప్రాథమిక విద్య, సంపూర్ణ పౌష్టికాహారం మరియు సంక్షేమ సేవలు అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమైనదని పేర్కొన్నారు. గ్రామ చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్థలాన్ని అందించిన దాతలకు, ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చిన సర్పంచ్ ఎస్. పవన్ కుమార్ రెడ్డికి సర్పంచ్ తరఫున మరియు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, మాజీ ఎంపీటీసీ శేఖర్ రెడ్డి, రిటైర్డ్ డీటీ తిమ్మారెడ్డి, సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, పద్మ రెడ్డి, ఎస్. మల్లేష్, కే. అశోక్, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు మరియు చిన్నారులు పాల్గొన్నారు

## గణేష్ మహారాజ్ ల ఆగమనం అదుర్స్!

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 ( ప్రభాత ఉదయం)**



ఈనెల 14న వినాయక చవితి సందర్భంగా గద్వాలలో గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి తీసుకవస్తున్న "గణేష్ మహారాజ్ ల ఆగమనం" వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. నిమజ్జన వేడుకలను తలపించే రీతిలో హోరెత్తే బ్యాండ్ మేళాలు, బాణసంచా టపాసుల కాంతుల నడుమ గణపయ్యకు నూతన పద్ధతుల్లో ఘన స్వాగతం పలికారు. వినాయక సేవా సమితి సభ్యులు మునుపెన్నడూ లేని రీతిలో కొత్త పద్ధతులు, అట్టహాసమైన ఏర్పాట్లతో ఈ ఆగమన వేడుకను నిర్వహించి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు.



సిద్ధిక్ నగర్ ఎంపీపీ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు..

## ఎంపీపీఎస్ సిద్ధిక్ నగర్‌లో అలరించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 3,(ప్రభాత ఉదయం)**

సిద్ధిక్ నగర్ మండలాపరిషత్ ప్రాథమిక పాఠశాల లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం అత్యంత వైభవంగా కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ అంతా కృష్ణాష్టమి శోభతో విలసిల్లింది. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల మనోహరమైన వేషధారణలతో విచ్చేసి అందరినీ అమితంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీకృష్ణుని లీలలు, గేయాలు నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు భగవద్గీత శ్లోకాలు పఠిస్తూ, పండుగ విశిష్టతను మరియు కృష్ణుని జీవిత సందేశాన్ని చక్కగా వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. బాలమణి మాట్లాడుతూ శ్రీకృష్ణుడి బోధనలు నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. సత్యం, ధర్మం, కర్తవ్యనిష్ఠ వంటి ఉత్తమ విలువలను విద్యార్థులు చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నృత్యాలు, వేషధారణలతో అలరించిన ప్రతిభావంతులైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న అధికారులు..

## బస్తీల్లో మెరిసిన 'సంక్షేమ' కాంతి: హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్, అమెజాన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాల అవగాహన సదస్సు

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 3, (ప్రభాత ఉదయం)**

ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి అర్హుడికీ అందాలనే లక్ష్యంతో హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్, అమెజాన్ వే ఫర్ లైఫ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పరిధిలోని మసీద్ బండ, తాతాజీ నగర్, వడ్డెర బస్తీలో "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అవగాహన నమోదు శిబిరం" వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా పోస్ట్ ఆఫీస్ పొదుపు పథకాలు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, ఈ శ్రమ్ కార్డులతో పాటు తెలంగాణ లేబర్ కార్డు నమోదుపై స్థానిక ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా అసంఘటిత రంగ కార్మికులకు లేబర్ కార్డు ద్వారా లభించే ఉచిత బీమా, వైద్యం, పిల్లల విద్య మరియు ఇతర ఆర్థిక సంక్షేమ ప్రయోజనాలను నిర్వాహకులు వివరంగా తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు అక్కడికక్కడే ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు చేపట్టి, అవసరమైన సహాయ సహకారాలు అందించారు. ఈ శిబిరంలో కాలనీ ప్రముఖులు వరికుప్పల సహదేవ్, కె. రాజు, సురేష్, లక్ష్మణ్, వెంకటేష్, సంజీవ్ తో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, గ్రామ సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సమాజంలో వెనుకబడిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను చేరవేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపడమే తమ ముఖ్య ఉద్దేశమని సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు.



## ఎమునోనిపల్లిలో డిజిటల్ క్రాప్ సర్వే క్షేత్ర స్థాయిలో పరిశీలన

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**

ధరూర్ మండలంలో వానాకాలం -- 2026 కు సంబంధించి చేపడుతున్న డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) ను గురువారం డీఏఓ వీరప్ప, ఏఓ శ్రీలత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధరూర్ మండలంలోని ఎమునోనిపల్లి గ్రామంలో జరుగుతున్న క్రాప్ బుకింగ్ ప్రక్రియను పరిశీలించి, రైతువారీగా, పంటలవారీగా సర్వేను పూర్తి చేయాలని ఏఈవోలను ఆదేశించారు. సాగు చేస్తున్న పంట, విస్తీర్ణం, భూమి వివరాలను జీపీఎస్, జియో ట్యాగింగ్ ఆధారంగా డిజిటల్‌గా నమోదు చేయడమే డీసీఎస్ ఉద్దేశమని అధికారులు తెలిపారు. డిసిఎస్ సర్వే ఆదారంగా పంట నమోదును త్వరితగతిన పూర్త్యి చేయాలని సూచించారు. ఆర్ఎన్ఆర్ 15048,బిపిటి 5204జైశ్రీరామ్,హెచ్ఎమ్‌టి సోనా,కెఎన్ఎమ్ 1638,కెఎన్ఎమ్ 7715,డబ్ల్యూజిఎల్ 44,వరి వంగడాలు సాగు చేసిన రైతులు విత్తనాల కొనుగోలు నమోదును తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేయకుండా సొంతంగా వాడుకున్న రైతులు డిక్లరేషన్ ఫారం పూరించి, సంబంధిత ఏఈఓ కి సమర్పించి నమోదు చేయించుకోవాలని సూచించారు.



## అంగన్‌వాడీ కేంద్రాలు మూత- ఆరుబయటే చిన్నారుల నిరీక్షణ

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు సరైన సమయానికి తెరుచుకోకపోవడంతో చిన్నారులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం ప్రతిరోజు ఉదయం 9 గంటలకల్లా అంగన్‌వాడీ కేంద్రాలను తప్పనిసరిగా తెరవాల్సి ఉన్నప్పటికీ, అనేక చోట్ల తాళాలు వేసే దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు బిఎల్ఓ విధులు కేటాయించడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని తెలుస్తోంది. టీచర్లు బిఎల్ఓ విధుల్లో నిమగ్నమైన సమయంలో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాల్సిన బాధ్యత ఆయాలపై ఉంటుంది. అయితే, మండలంలోని కొన్ని కేంద్రాల్లో ఆయాల నియామకం జరగకపోవడంతో, టీచర్లు లేని సమయంలో కేంద్రాలు పూర్తిగా మూతపడుతున్నాయి. దీంతో ఉదయాన్నే అంగన్‌వాడీలకు వచ్చే చిన్న పిల్లలు గంటల తరబడి ఆరుబయటే ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. పౌష్టికాహారం, ముందస్తు విద్య అందక చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో ఉ దయాన్నే అంగన్‌వాడీలకు వచ్చే చిన్న పిల్లలు గంటల తరబడి ఆరుబయటే ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. పౌష్టికాహారం, ముందస్తు విద్య అందక చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

## మహిళా కండక్టర్‌పై అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం: గద్వాల్ డిపో జె ఏ సి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**



గద్వాల్ ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న ఒక మహిళా కండక్టర్‌ను లక్ష్యంగా చేసుకుని, ఒక రిపోర్టర్ అత్యంత అసభ్యకరంగా, అవమానకరంగా వార్త రాయడాన్ని నిరసిస్తూ గురువారం ఉదయం గద్వాల్ డిపో జేఏసీ ఆధ్వర్యంలో గద్వాల్ డిపో గేటు ముందర కార్మికులు, నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి గేటు ధర్నా. నిర్వహించారు. విధులు నిర్వర్తిస్తున్న ఒక మహిళా ఉద్యోగిని అని కూడా చూడకుండా, ఆమె మనోభావాలు దెబ్బతినేలా, ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమైన చర్య అని మహిళల పట్ల సమాజంలోనూ, పని ప్రదేశాల్లోనూ ఇలాంటి అవమానకరమైన రాతలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని జెఏసి నాయకులు స్పష్టం చేశారు. మహిళా కండక్టర్‌పై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన సంబంధిత విలేఖరిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అని, మహిళా ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని, హక్కులను కాపాడాలి అని, బాధితురాలికి వెంటనే పూర్తిస్థాయిలో న్యాయం చేయాలి అని వారు డిమాండ్ చేశారు.

# రైతు బంధు,రైతు బీమా కేసీఆర్ పథకాలు దేశానికే దిక్సూచి - పద్మ వేంకటేశ్వర రెడ్డి

**దేశంలోనే రైతులకు 24గంటల కరెంట్ ఇచ్చిన ఏకైక బిఆర్ఎస్ ప్రభుత్వం..**

**ధరూర్ సబ్ స్టేషన్ ముట్టడిలో పాల్గొన్న...**

**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగర్ దొడ్డి వెంకట్రాములు..**

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**

రైతులలో ఆత్మవిశ్వాసం,ఆత్మ అభిమానం పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కే దక్కుతుందని మాజీ జెడ్పిటిసి సభ్యురాలు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పద్మ వేంకటేశ్వర రెడ్డి అన్నారు.. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు ప్రజాపాలన కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో వ్యవసాయ విధ్వంసంపై నిరసన కార్యక్రమంలో భాగంగా ధరూర్ మండల కేంద్రంలోని వైఎస్ఆర్ చౌరస్తా నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించి,సబ్



స్టేషన్ ఎదురుగా మాజీ జెడ్పిటిసి సభ్యురాలు పద్మ వేంకటేశ్వర రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ హన్మంతు నాయుడు..బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగర్ దొడ్డి వెంకట్రాములు.. పాల్గొన్నారు... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండుగ చేస్తే రేవంత్ రెడ్డి వ్యవసాయాన్ని విధ్వంసం చేశారని,వరంగల్ రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కాంగ్రెస్ పార్టీ అమలు చేయకుండా రైతులను హరిగోసా పెడుతుందని రైతుల ఆక్రోశంతో ఈ ప్రభుత్వం పతనం కావడం తథ్యం అని దుయ్యబట్టారు..ప్రజావ్యతిరేకత వస్తేనే నిరసనలు వెల్లువెత్తాయని,వరంగల్ రైతు డిక్లరేషన్ ఒక్కటంటే ఒక్క హామీ నేర్పించలేదు రేవంత్ ప్రభుత్వ మని, 1000 రోజుల పాలనలో మెయ్యి మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని,రైతులకు ఆత్మవిశ్వాసంతో ఆత్మాభిమానంతో బతుకుదెరువు చూపింది కేసీఆర్ ప్రభుత్వమని పద్మ వేంకటేశ్వర రెడ్డి అన్నారు,బిఆర్ఎస్ పార్ రాష వలసల రాష్ట్ర నాయకుడు నాగర్ దొడ్డి వెంకట్రాములు, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ హన్మంతు నాయుడు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం పాడిపంటల రాష్ట్రంగా మార్చిందని,కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్ళు మిగిలాయని,ఆంధ్రుల హేళన నుండి తెలంగాణకు ఆత్మ గౌరవాన్ని తెచ్చిన ఈ రాష్ట్రానికి కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆగం అయిందని,దశాబ్దాల కాలంగా పాలమూరుకు కాంగ్రెస్ సాగు నీళ్లు అందించలేని అసమర్థత కారణమన్నారు..ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గాజులపాడు రాఘు,చిన్నపాడు ఆంజనేయులు, వెంకటేష్ నాయుడు,మోనేష్,జనార్ధన్ రెడ్డి,ముని బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు...

# సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు ఊపిరితిత్తులు, రక్తనాళాల ఉచిత వైద్య శిబిరం

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 3,(ప్రభాత ఉదయం)**

నిరంతరం ట్రాఫిక్ నియంత్రణలో ఉంటూ ధూళి, వాయు కాలుష్యానికి గురవుతున్న సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ యశోద హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత 'పల్మో వాస్కులర్' వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సైబరాబాద్ పోలీస్ కమిషనర్. డాక్టర్ ఎం. రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఐ వెల్ఫేర్ నాగరాజు రెడ్డి, ఎస్సీ ఎస్సీ సీఈఓ నావేద్ ఆలం ఖాన్, అసిస్టెంట్ డైరెక్టర్ వై. భానుమూర్తితో పాటు యశోద హాస్పిటల్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో సిబ్బందికి పల్మోనరీ ఫంక్షన్ టెస్ట్ టెస్ట్, సిక్స్ మినిట్ వాక్ టెస్ట్ వాస్కులర్ స్క్రీనింగ్ వంటి అధునాతన పరీక్షలు నిర్వహించారు. ఊపిరితిత్తుల పనితీరు, శ్వాసకోశ ఆరోగ్యం, రక్త ప్రసరణ తీరును ఈ పరీక్షల ద్వారా అంచనా వేసి తగిన వైద్య సలహాలు అందించారు. కమిషనర్ రమేష్ ఐపీఎస్ మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు ప్రతికూల వాతావరణంలో, గంటల తరబడి ధూళి కాలుష్యంలో విధులు నిర్వహిస్తుంటారు. వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత ప్రాధాన్యమైన అంశం. ప్రాథమిక దశలోనే ఆరోగ్య సమస్యలను గుర్తించడం వల్ల సరైన



అనంతరం యశోద హాస్పిటల్ ఏర్పడిన సమావేశంలో మాట్లాడుతున్న సిపి రమేష్.



ట్రాఫిక్ పోలీసుల కోసం యశోద హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్..

సమయంలో చికిత్స పొందవచ్చు. సిబ్బంది క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు యోగా, వ్యాయామం శ్వాస సంబంధిత వ్యాయామాలను దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో యశోద హాస్పిటల్స్ (హైటెక్ సిటీ) యూనిట్ హెడ్ మేఘా చిత్కారా, డీఎంఎస్ డాక్టర్ వెంకట్ రామన్ కొల్లా, మార్కెటింగ్ హెడ్ ప్రదీప్, కార్పొరేట్ మార్కెటింగ్ హెడ్ సోమశేఖర్, ప్రముఖ పల్మోనాలజిస్ట్ డాక్టర్ గోపి యడ్లాపల్లి, వాస్కులర్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# మైలార్దేవుపల్లిలో ఆటో డ్రైవర్ దారుణ హత్య

**24 గంటల్లో రెండు హత్యలు**

**పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు ?**

**బుద్వేల్, సెప్టెంబరు 3 (ప్రభాత ఉదయం)**

మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అలీ నగర్ లో ఓ యువకుడు బుధవారం రాత్రి హత్య కు గురైనాడు. వివరాలను రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు జహంగీరాబాద్ లోని తన ఇంటి నుంచి డ్రైవర్ గా విధులు నిర్వహించడానికి బయలు దేరిన అబ్దుల్ రహూఫ్ బోజనానికి రాలేదు. దీంతో అతని భార్య సయ్యదా యూసుఫ్ ఉన్నీసా మధ్యాహ్నం 3 గంటలకు భర్తకు ఫోన్ చేసింది. రాత్రి బోజనానికి నేరుగా ఇంటికి వస్తానని అబ్దుల్ రహూఫ్ ఆమెకు సమాదానం ఇచ్చాడు. ఇదిలా ఉండగా రాత్రి 11:43 గంటలకు షేక్ షాహిత్ అనే వ్యక్తి అబ్దుల్ రహూఫ్ భార్య సయ్యదా యూసుప్ ఉన్నీసా కు ఫోన్ చేసి అలీనగర్ ఆర్చిడ్ స్కూల్ వద్ద జావీద్ అనే వ్యక్తి తో పాటు అతని అనుచరులు అబ్దుల్ రహూప్ పై కత్తులతో దాడిచేశారని సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న వెంటనే సయ్యద యూసుఫ్ ఉన్నీసా తన బంధువులతో కలసి సంఘటనా స్థలానికి చేరుకుంది. అబ్దుల్ రహూప్ తీవ్ర రక్తగాయాలతో పడి ఉన్నాడని, ఆయన అక్కడిక్కడే మృతి చెంది ఉన్నాడని గుర్తించారు. ఈ విషయమై సయ్యద యూసుఫ్ ఉన్నీసా గురువారం తెల్లవారు జామున ఒంటి గంటలకు మైలార్దేవుపల్లి పోలీసులకు పిర్యాదు చేసింది.గతంలో జావీద్ సోదరుడు సాజిద్ మృతి చెందగా, అ మృతికి అబ్దుల్ రహూఫ్ కారణమని జావీద్ అనుమానిస్తు అతనిపై పాత కక్ష పెంచుకున్నట్లు తెలిసింది. ఈ పాత కక్షల కారణంగానే జావీద్ తన అనుచరులతో కలసి అబ్దుల్ రహూఫ్ పై కత్తులతో దాడిచేసి హత్య చేసినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న మైలార్దేవుపల్లి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. నిందితులెవరైన పట్టుకుని కఠినంగా శిక్షిస్తామన్నారు. పాత కక్షలతో ఈ హత్య జరిగిందా.. మరేమైన కారణాలున్నాయా.. అని చూస్తున్నామన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చ్యురీకి తరలించడం జరిగిందన్నారు.

**వరుస హత్యలతో హాట్ టాపిక్ గా మారిన మైలార్ దేవుపల్లి పోలీస్ స్టేషన్ :**

మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పల్లెచెరువు రోడ్డులో లక్ష్మీగూడ రాజీవ్ గృహకల్ప కు చెందిన రౌడీ షీటర్ ఖాజా సోహెల్ (26) బుధవారం తెల్లవారుజామున దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. గుర్తు తెలియని వ్యక్తులు ఆయనను కత్తులతో పొడిచి హత్య చేశారు. ఆ సంఘటన జరిగి 24 గంటలు గడవక ముందే తరిగి మైలార్దేవుపల్లి అలీనగర్ లో ఆటో డ్రైవర్ అబ్దుల్ రహూఫ్ (28) దారుణ హత్యకు గురైనారు. ఈ రెండు హత్యలు మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగడం తో ఈ అంశం స్థానికంగా హాట్ టాపిక్గా మారింది. ఎందుకు ఈ హత్యలు జరుగుతున్నాయి అని స్థానికంగా చర్చ జరుగుతుంది. పాత కక్షలతోనా.. లేదా గంజాయి సేవించిన మత్తులో హత్యలకు పాల్పడుతున్నారా.. అనే చర్చ కొనసాగుతుంది.

**పోలీసుల అదుపులో నిందితులు ?**

బుధవారం తెల్లవారుజామున మైలార్దేవుపల్లి పల్లెచెరువు మార్గంలో హత్యకు గురైన ఖాజా సోహెల్ హత్య కేసులో



రక్తపు మడుగులో అబ్దుల్ రహూఫ్

నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఇద్దరు నిందితులు పోలీస్ స్టేషన్ కు వచ్చి లొంగిపోయారని, మరో ఇద్దరిని టాస్కోర్స్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తుంది. బుధవారం రాత్రి 11:30 గంటలకు మైలార్దేవుపల్లి అలీ నగర్ లో హత్యకు గురైన ఆటో డ్రైవర్ అబ్దుల్ రహూవ్ హత్య కేసు లో ముగ్గురిని సంగారెడ్డి లో ఆరెస్ట్ చేసినట్లు తెలుస్తుంది. వీరి వివరాలను త్వరలోనే వెల్లడించే అవకాశం ఉంది.

# నిరంతర పర్యవేక్షణకు నిఘా కెమెరాల దోహదపడతాయి: డిసిసి శ్రీనివాస్

**బొల్లారం పోలీస్ స్టేషన్లో పరిధిలో 103 సీసీటీవీ కెమెరాల ప్రారంభం**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం):**

నిరంతర పర్యవేక్షణ లో సిసి కెమెరాల పాత్ర అనిర్వచనీయం అని శేరిలింగంపల్లి డిసిసి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఐడీఏ బొల్లారం డివిజన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఆయన ప్రారంభించారు.బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చెసిన 103 సీసీటీవీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల భద్రత, నేరనియంత్రణ, నిందితులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని అన్నారు.రోడ్డు ప్రమాదాలు,




దొంగతనాల కేసుల మిస్టరీ ఛేదించడంలో కెమెరాల పాత్ర ఎనలేనిదన్నారు. కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా కలిగే లాభాలను ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఆయా పరిసరాలలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నగరంలోని అన్ని పోలీస్స్టేషన్ల పరిధిలో కెమెరాలను ఏర్పాటు చేయడంతో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ఈ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు కోసం సహకరించిన ఖాజిపల్లి మున్సిపల్ చైర్మన్,ఎన్వీఆర్ పాఠశాల, జాయ్ ఇంటర్నేషనల్ పాఠశాల, పిబిఆర్ హాస్పిటల్, హెడ్ క్వార్టర్ రెస్టారెంట్,మైత్రి కన్స్ట్రక్షన్స్, ఐటీసీ పరిశ్రమ, జెనెఎక్స్ పరిశ్రమ, ఆర్ఆర్ కె హబ్ నిర్వాహకులకు డిసిసి ప్రశంశా పత్రము ఇచ్చి , పౌర సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో ఖాజిపల్లి సీనియర్ నాయకులు గద్దె నర్సింహా,ఎస్ఐ అక్షిత, బొల్లారం ఇండస్ట్రీస్ అధ్యక్షులు ఆనంద్ రావ్, బొల్లారం ఇండస్ట్రీస్ ప్రధాన కార్యదర్శి రాయుడు,జాయ్ స్కూల్ యాజమాన్యం ప్రసాద్ రెడ్డి, సతీష్, ఎన్వీఆర్ స్కూల్ యాజమాన్యం వెంకట్రావు, మైత్రి కన్స్ట్రక్షన్ కొండల్ రెడ్డి, హెడ్ క్వార్టర్ హోటల్ యాజమాన్యం శ్రీకాంత్ రెడ్డి, తిరుపతి రెడ్డి,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆదికి అదృష్టం వరించేనా..?

**మొదటి పేజీ తరువాయి...**

బాధ్యతలు చేపట్టారు.

**సీనియారిటీ.. సిన్సియారిటీ**

మంత్రి పదవి కోసం పోటీలో ఆది శ్రీనివాస్కు పార్టీ విధేయత, రాజకీయ అనుభవం, వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తిత్వం అనుకూల అంశాలుగా మారవచ్చన్న చర్చ సాగుతోంది. ప్రభుత్వ విప్గా ఇప్పటికే ప్రభుత్వ వ్యవహారాలను దగ్గరగా చూసిన అనుభవం కూడా ఆయనకు కలిసొచ్చే అవకాశం ఉందని అనుచరులు భావిస్తున్నారు.

**వేములవాడకు తొలి మంత్రి పదవా?**

ఆది శ్రీనివాస్కు మంత్రి పదవి దక్కితే వేములవాడ రాజకీయాల్లో అది కీలక పరిణామంగా మారనుంది. నియోజకవర్గానికి ఇప్పటివరకు మంత్రి పదవి దక్కలేదన్న నేపథ్యంలో.. ఈసారి అవకాశం వస్తే వేములవాడకు రాష్ట్ర మంత్రివర్గంలో తొలిసారి ప్రాతినిధ్యం లభించినట్లవుతుంది. దీంతో నియోజకవర్గ అభివృద్ధి, నిధుల సాధన, రాజకీయ ప్రాధాన్యం మరింత పెరిగే అవకాశం ఉంటుందని ఆయన అనుచరులు ఆశిస్తున్నారు.

**ఉమ్మడి కరీంనగర్కు నాలుగో మంత్రి?**

ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి శ్రీధర్బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్కుమార్ మంత్రివర్గంలో ఉన్నారు. ఆది శ్రీనివాస్కు కూడా మంత్రి పదవి లభిస్తే ఉమ్మడి జిల్లాకు నాలుగు మంత్రి పదవులు దక్కినట్లవుతుంది. ఒకే ఉమ్మడి జిల్లాకు ఇంతటి ప్రాతినిధ్యం రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. అదే సమయంలో బీసీ వర్గానికి మరింత ప్రాధాన్యం ఇచ్చిన సంకేతంగా కూడా దీనిని చూడవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆది పేరు ఎందుకు బలపడుతోంది?**

బీసీ ప్రాతినిధ్యం.. సామాజిక సమీకరణాల్లో బీసీ కోటాకు ప్రాధాన్యం ఉంటే ఆది పేరు ముందుకు రావచ్చు.

పార్టీ విధేయత.. కాంగ్రెస్ కష్టకాలంలోనూ పార్టీతో కొనసాగిన నాయకుడిగా గుర్తింపు.

విప్ అనుభవం.. ఇప్పటికే ప్రభుత్వంలో కీలక బాధ్యత నిర్వహిస్తున్న అనుభవం.

వివాదరహిత ఇమేజ్.. సౌమ్య స్వభావం, క్రమశిక్షణతో కూడిన రాజకీయ శైలి.

ప్రాంతీయ సమతుల్యత.. వేములవాడకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా ఉత్తర తెలంగాణలో రాజకీయ సమీకరణాలను సమతుల్యం చేసే అవకాశం.

**ఖాయమా.. ఊహాగానమేనా?**

అయితే ఆది శ్రీనివాస్కు మంత్రి పదవి ఖరారైందని ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం ఆయన పేరు బలంగా వినిపిస్తుండటం రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలు, సమీకరణాల ఆధారంగానే. మంత్రివర్గంలో ఎవరిని తీసుకోవాలన్న తుది నిర్ణయం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం చేతుల్లోనే ఉంటుంది.

సురేఖ తొలగింపుతో ఏర్పడిన ఖాళీని ఎవరు భర్తీ చేస్తారు? బీసీ సమీకరణాలకు ప్రాధాన్యం ఇస్తారా? ప్రాంతీయ సమతుల్యతను పరిగణనలోకి తీసుకుంటారా? లేక మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో మరిన్ని మార్పులు ఉంటాయా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**సురేఖ ఔట్..ఆది పేరు ఇన్..**

విప్ నుంచి మంత్రి వైపు అడుగులు పడతాయా?

వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్కు మంత్రి యోగం ఉందా? అన్నదే ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో హాట్టాపిక్గా మారింది.



# మాజీ మంత్రి హరీశ్రావు సమక్షంలో బీఆర్ఎస్లోకి బొల్లారం కాంగ్రెస్ నేతలు

**పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన మాజీ మంత్రి**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం):**

బొల్లారం 272వ డివిజన్కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావును కలిసి పార్టీలో చేరగా, వారికి హరీశ్ రావు గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మునీర్, తాహీర్, అజామ్, అయూబ్ ఖాన్, అఫ్జాల్, కృష్ణ, విట్టల్ చారి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో పటాన్చెరు నియోజకవర్గ ఇన్చార్జి వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, జిన్నారం మాజీ ఎంపీపీ కొలన్ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి, బొల్లారం మాజీ కౌన్సిలర్ హనుమంత్ రెడ్డి, సాయి కిరణ్ రెడ్డి, వి. బీరప్ప యాదవ్, శ్రీకాంత్ యాదవ్, సతీష్



విధి నిర్వహణలో గాయపడిన ట్రాఫిక్ ఎస్ఐని పరామర్శించిన జాయింట్ సీపీ..

# గాయపడిన ఎస్ఐని పరామర్శించిన సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ

**ట్రాఫిక్ సిబ్బంది కోసం ప్రత్యేక 'పల్మో వాస్కులర్' వైద్య శిబిరం పరిశీలన**

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 3, (ప్రభాత ఉదయం)**

విధి నిర్వహణలో గాయపడిన ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ ఆరోగ్యాన్ని జాయింట్ పోలీస్ కమిషనర్ పరామర్శించడంతో పాటు, సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన వైద్య పరీక్షలను స్వయంగా పరిశీలించి వారిలో ధైర్యాన్ని నింపారు. కొల్లూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్కు చెందిన ఎస్ఐ దాదా సాహెబ్ ఇటీవల విధి నిర్వహణలో గాయపడగా, యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ సున్ప్రీత్ సింగ్ గురువారం నేరుగా వెళ్లి పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఎస్ఐ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న జాయింట్ సీపీ, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తగిన విశ్రాంతి తీసుకుంటూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సలహా ఇచ్చారు. ట్రాఫిక్ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు అనంతరం సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల కోసం యశోద ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'పల్మో వాస్కులర్ స్క్రీనింగ్ క్యాంప్'ను జాయింట్ సీపీ పరిశీలించారు. నిరంతరం రహదారులపై ధూళి వాహనాల కాలుష్యం మధ్య విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది శ్వాసకోశ, రక్తనాళాల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ సీపీ సున్ప్రీత్ సింగ్ స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకుని సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నిబద్ధతతో పనిచేసే సిబ్బంది సంక్షేమానికి సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ అరూర్ రత్నం తదితరులు పాల్గొన్నారు.



# బహదూర్గూడ, సరూర్నగర్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె.కిరణ్మయి క్షేత్రస్థాయి తనిఖీలు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె.కిరణ్మయి బహదూర్గూడ, సరూర్నగర్ ప్రాంతాల్లో పలు ప్రభుత్వ సంస్థలను సందర్శించి, అక్కడ కొనసాగుతున్న సేవలు, విద్యా కార్యక్రమాలు , వైద్య సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీపీ ఎస్ బహదూర్గూడ, అంగన్వాడీ కేంద్రం, ప్రీ-ప్రైమరీ పాఠశాల, బహదూర్గూడ, సరూర్నగర్, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం , సరూర్నగర్లను సందర్శించారు.జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో విద్యార్థులు, వైద్యులు , సిబ్బందితో మాట్లాడి, విద్యార్థులకు అందుతున్న శిక్షణ, నిర్వహిస్తున్న తరగతులు మరియు అందుబాటులో ఉన్న పునరావాస సేవలను సమీక్షించారు. విద్యార్థుల అవసరాలు, కేంద్రం పనితీరు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల పురోగతిని సమీక్షించి, దివ్యాంగులకు నాణ్యమైన సేవలు సమర్థవంతంగా అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా ఘనంగా నిర్వహించుకోవాలి: కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**



గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, ఘనంగా నిర్వహించాలి, వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుతంగా, సురక్షితంగా ఉత్సవాలు నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో గణేష్ చవితి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ డా. కె. కిరణ్మయితో కలిసి డీసీపీలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 14న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై, 24న నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో మండపాల నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో పాటు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. గణేష్ శోభాయాత్ర మార్గాల్లో గుంతలు, దెబ్బతిన్న రహదారులకు ప్యాచ్‌వర్క్ చేపట్టాలని, నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్లు, బారికేడింగ్, వేదికలు, మొబైల్ టాయిలెట్లు, తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు సమన్వయంతో ప్రతి ఉత్సవ కేంద్రాన్ని ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లు, కనెక్షన్లు తదితర అంశాలను విద్యుత్ శాఖ నిపుణుల సహకారంతో తనిఖీ చేయాలని సూచించారు. ఉత్సవ మండపాలు, విగ్రహాల ఏర్పాటు ప్రదేశాలను సురక్షితంగా ఎంపిక చేసి, అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని, మండపాల నిర్మాణం పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రదేశాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మండపాల వద్ద పరిశుభ్రత, ఫాగింగ్, పారిశుద్ధ్య చర్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని సూచించారు.విగ్రహాల ఊరేగింపు సమయంలో వాహనాల్లో యాంత్రిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు చేపట్టాలని, నిమజ్జన మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన చెట్లు తదితర ప్రమాదకర అంశాలను తొలగించాలని తెలిపారు. చెరువుల వద్ద అవసరమైన సంఖ్యలో క్రేన్లు, బారికేడింగ్, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వైద్య, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు, కంట్రోల్ రూమ్, వేగవంతమైన స్పందన వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎక్కడైనా సమస్య తలెత్తిన వెంటనే స్పందించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి ప్రమాదాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కోరారు.భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, నిమజ్జన ప్రదేశాల్లో తగినన్ని క్రేన్లు, నిరంతర విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె.కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి స్టేట్ ఎగ్జిక్యూటివ్ రవీందర్ రెడ్డి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి చైర్మన్ కె.నిరంజన్, సెక్రెటరీ సాయికిరణ్ చారి, వైస్ ప్రెసిడెంట్ టి.ఆనంద్ గౌడ్, ఆర్డీఓలు శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సైబరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణేశ ఉత్సవ ఏర్పాట్ల సమీక్ష సమావేశాని హాజరైన అధికారులు..

## సైబరాబాద్‌లో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

### అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన సీఎంసీ కమిషనర్ సృజనా

**శేరిలింగంపల్లి ,సెప్టెంబర్ 3,(ప్రభాత ఉదయం)**

గణేష్ ఉత్సవాలు–2026ను అత్యంత వైభవంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సైబరాబాద్ పరిధిలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జి. సృజన ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. ఉత్సవాల కార్యాచరణ ప్రణాళిక ముందస్తు ఏర్పాట్లపై సైబరాబాద్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి సమీక్షా సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సైబరాబాద్ పరిధిలో మొత్తం 54 విగ్రహ నిమజ్జన ప్రాంతాలు ఉన్నాయని, ప్రతి పాయింట్ వద్ద ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

**ప్రధాన ఏర్పాట్ల ముఖ్యాంశాలు**

వివిధ శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలు, వినతులను పరిష్కరిస్తూ అంతర్ శాఖల సమన్వయంతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భక్తులకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ మళ్లింపులు, నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. అత్యవసర పరిస్థితుల కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను అందుబాటులో ఉంచుతున్నారు. నిమజ్జన వేదికల వద్ద నిరంతర విద్యుత్, తగినంత వెలుతురు (లైటింగ్), పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని ఆదేశించారు. నిమజ్జనం సాగే మార్గాల్లో గుంతల పూడ్చివేత (ప్యాచ్ వర్క్), అవసరమైన చోట బలమైన బారికేడింగ్ ఏర్పాటు చేయనున్నారు. విగ్రహాల నిమజ్జనం శరవేగంగా సాగేందుకు తగిన సంఖ్యలో భారీ క్రేన్లను సిద్ధం చేస్తున్నారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఇంజనీర్లు, ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు. భక్తులందరూ ప్రశాంత వాతావరణంలో వేడుకలను ఘనంగా జరుపుకునేలా అన్ని విభాగాల అధికారులు పూర్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సమావేశంలో ముక్తకంఠంతో నిర్ణయించారు.

## సురేఖ స్వయంకృతాపరాధం

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్,సెప్టెంబర్3 (ప్రభాత ఉదయం)**

మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించడం పూర్తిగా ఆమె స్వయం కృతాపరాధమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వం సురేఖకు ఎన్నో అవకాశాలు ఇచ్చినప్పటికీ, వాటిని ఆమె సద్వినియోగం చేసుకోలేకపోయారని విమర్శించారు. సొంత కుటుంబ సభ్యులను అదుపులో ఉంచుకోవడంలో సురేఖ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ, ఆమె కుటుంబ సభ్యులు పదేపదే తీవ్రస్థాయిలో బహిరంగ విమర్శలు చేస్తూ పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యవహరించారని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సమయంలోనూ వారిని వారించకపోవడం సురేఖ వైఫల్యానికి నిదర్శనమన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లతో కూడిన కాంగ్రెస్ అగ్రనాయకత్వం పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ కఠిన నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.




## నిరంతర పర్యవేక్షణకు నిఘా కెమెరాల దోహదపడతాయి: డిసిసి శ్రీనివాస్

### బొల్లారం పోలీస్ స్టేషన్‌లో పరిధిలో 103 సీసీటీవీ కెమెరాల ప్రారంభం

**పటాన్ చెరు, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం):**

నిరంతర పర్యవేక్షణ లో సిసి కెమెరాల పాత్ర అనిర్వచనీయం అని శేరిలింగంపల్లి డిసిసి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఐడీఏ బొల్లారం డివిజన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఆయన ప్రారంభించారు.బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చెసిన 103 సీసీటీవీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల భద్రత, నేరనియంత్రణ, నిందితులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని అన్నారు.రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల కేసుల మిస్టరీ ఛేదించడంలో కెమెరాల పాత్ర ఎనలేనిదన్నారు. కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా కలిగే లాభాలను ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఆయా పరిసరాలలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో కెమెరాలను ఏర్పాటు చేయడంతో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ఈ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు కోసం సహకరించిన ఖాజిపల్లి మున్సిపల్ చైర్మన్,ఎన్విఆర్ పాఠశాల, జాయ్ ఇంటర్నేషనల్ పాఠశాల, పిబిఆర్ హాస్పిటల్, హెడ్ క్వార్టర్ రెస్టారెంట్,మైత్రి కన్స్ట్రక్షన్స్, ఐటీసీ పరిశ్రమ, జెనెఎక్స్ పరిశ్రమ, ఆర్ఆర్ కె హబ్ నిర్వాహకులకు డిసిసి ప్రశంశా పత్రము ఇచ్చి , పౌర సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఖాజిపల్లి సీనియర్ నాయకులు గద్దె నర్సింహా,ఎస్ఐ అక్షిత, బొల్లారం ఇండస్ట్రీస్ అధ్యక్షులు ఆనంద్ రావ్, బొల్లారం ఇండస్ట్రీస్ ప్రధాన కార్యదర్శి రాయుడు,జాయ్ స్కూల్ యాజమాన్యం ప్రసాద్ రెడ్డి, సతీష్, ఎన్విఆర్ స్కూల్ యాజమాన్యం వెంకట్రావు, మైత్రి కన్స్ట్రక్షన్ కొండల్ రెడ్డి, హెడ్ క్వార్టర్ హోటల్ యాజమాన్యం శ్రీకాంత్ రెడ్డి, తిరుపతి రెడ్డి,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## లెవెల్ క్రాసింగ్‌లు, ప్రతిపాదిత ఆర్‌ఓబిల పరిశీలన

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**

**రైల్వే శాఖ ప్రతిపాదించిన లెవెల్ క్రాసింగ్‌లు 12, 13తో పాటు ప్రతిపాదిత రైల్వే ఓవర్ బ్రిడ్జిల లను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పరిశీలనలో గుర్తించిన అంశాల ఆధారంగా సమగ్ర నివేదికలను సిద్ధం చేసి, తదుపరి చర్యల కోసం రైల్వే శాఖకు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.**



## సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి:

### జేపీసీ చైర్మన్ ఊటు యశ్వంత్, కన్వీనర్ డా. రామారావు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 (ప్రభాత ఉదయం)**

సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ పోస్టర్ ను తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి , రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ఐ డి ఓ సి, కొంగరకలాన్‌లో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా టి జి ఈ జెఎసి రంగారెడ్డి జిల్లా చైర్మన్ యశ్వంత్ మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగ జేఏసీ కార్యాచరణలో భాగంగా 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా ఉద్యోగస్తులు, గెజిటెడ్ అధికారులు,ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో రంగారెడ్డి జిల్లా టి జి ఈ జెఎసి కన్వీనర్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ ఇప్పుడున్న ప్రభుత్వం అధికారము లోకి వచ్చిన 6 మాసాలలో ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయమని ప్రభుత్వాన్ని కోరారు. సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, నాలుగవ తరగతి ఉద్యోగులు, కార్మికులు , పెన్షనర్లు అందరూ ఐక్యంగా ముందుకు వచ్చి, తమ నిరసనను బలంగా వినిపిద్దామని తెలియజేసి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు,ఉపాధ్యాయులు , పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సెప్టెంబర్ 10 లో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగ నాయకులు కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా కో కన్వినర్ యమ్. శ్రీను, కో చైర్మన్లు గోపాల్, రమేష్, డేవిడ్, గోపాల్ జి, శాంతి శ్రీ, వైస్ చైర్మన్లు నూతనకంటి వెంకట్, సైదమ్మ, రాకేష్, జమ కుశాల్, మల్లారెడ్డి, రంగయ్య,గోపాల్, వెంకటస్వామి, పరమేష్ , మహేష్, సంతోష్, ప్రమీల, రాణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



## సరూర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

**రంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 3(ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి,జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి సరూర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, రోగుల హాజరు, ఓపీ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, ల్యాబొరేటరీ సేవలు, ప్రసూతి , శిశు ఆరోగ్య సేవలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందేలా సిబ్బంది సమయపాలన పాటిస్తూ, అందుబాటులో ఉన్న అన్ని సేవలను ప్రజలకు తెలియజేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని, మందుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి సూచించారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన..

### దుర్గానగర్ చౌరస్తాలో ధర్నా..

### పెద్దఎత్తున తరలిరావాలని గుమ్మడి కుమార్ పిలుపు

**రాజేంద్రనగర్,సెప్టెంబర్03(ప్రభాత ఉదయం):**



కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు గుమ్మడి కుమార్ తెలిపారు.బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకు,మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సూచనలతో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో చోటుచేసుకున్న వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ధర్నాలో మైలార్దేవ్‌పల్లి,కాటేదాన్ డివిజన్లకు చెందిన మహిళలు,వృద్ధులు,దివ్యాంగులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు,బీఆర్ఎస్ పార్టీ అభిమానులు,కుటుంబ సభ్యులు పెద్దఎత్తున పాల్గొనాలని గుమ్మడి కుమార్ కోరారు.ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని,ప్రజా సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దుర్గానగర్ చౌరస్తాలో సెప్టెంబర్ 4న ఉదయం 10 గంటలకు ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.మైలార్దేవ్‌పల్లి,కాటేదాన్ డివిజన్ల నుంచి బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుమ్మడి కుమార్ విజ్ఞప్తి చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608